శ్రీ

"జానకిరామ్ పట్నాయక్"

★

# నరపశువు



"అక్కయ్యగారూ! వెళ్లివస్తానండి!!"

"అప్పుడే? వచ్చి ఎంతో సేపైనా కాలేదే! ఎన్నాళ్ళకో వచ్చావు. కాస్సేపు కూచుందూ!"

"ఆఫీసునుంచి ఆయన వచ్చే వేళయింది. ఇంట్లో లేకపోయానా ఇక సరి! మీకు బాగా తెలుసునుగా ఆయనస్వభావం."

"ఔను. నేను దానికి వొప్పుకున్నాను. ఆయన స్వభావం చాల చెడ్డది, లక్ష్మీ! నీవు కాగా, అలా అన్ని బాధలూ సహిస్తున్నావు, నావంటి దన్నయితే మూడు రోజులకే సంసారం ముక్కలై పోయివుణ్ణు."

• • •

"అందరూ ఆయనవంటి వాళ్లుంటే ప్రపంచం మరి ఎందుకు? ఏదయినా ఆడవాళ్లం కనుక సహించుకోవలసిందే!"

"ఈలాంటి ముసలమ్మ కబుర్ల వల్ల నేవాళ్ళకంత గడుసుతనంగా ఉంది. నీవుకూడ యథారాజా తథాప్రజా అన్నట్టు నడిస్తే ఈ సరికి అంతా కుదిరిపోయేది."

"అలా ఉండటానికి నా అంతః కరణ ఒప్పుకోదు. పడినంతకాలం పడంకదా- ఎప్పుడూ ఆయన మనస్సు ఒకే దారిని ఉండదు కదా? ఏనాటికైనా మంచి దినాలు వస్తవి కదా అన్న ఆలోచనలో పడి, దీన్నంతా సహిస్తున్నాను."

"ఎప్పుడో అనుకూలం వస్తుందని, అంతవఱకూ ఈ నరక కూపంలో యాతనలు అనుభవించట మేనా"

"ఏం చెయ్యను! నా వ్రాత నేననుభవించక పోతే ఎవరనుభవిస్తారు?...సరే! వెళ్లి వస్తాను. దయ ఉంచండి."

లక్ష్మి, ప్రసాదరావు ఇల్లాలు ఇంజనీరింగు ఆఫీసులో హెడ్ గుమస్తా. నెలకు 150 రూపాయీల జీతం.

భయపడుతూ, యింటికి వచ్చేసరికి, ధుమధుమ లాడుతూన్న భర్త ముఖం, లక్ష్మికి కన్పించింది. శరీరంఅంతా కపించ నారంభించింది. నిలువబడ్డదగ్గర భూమి బ్రద్దలై పోతూన్నట్లు అయింది. కండ్ల ఎదుట అంధకారం క్రమ్మేసింది.

"ఎక్కడకు రాణీవాసం చలాయించడానికి వెళ్ళినావు?"

"..............."

"ఘంటన్నరై వచ్చి కూచున్నా, పత్తాపికరూ, లేదు. మగడన్న భయం కొంచెమేనా ఉంటేనా?"

"..............."

"మాటాడవేం? బెల్లం కొట్టిన రాయిలా!"

"..............."

"చెప్పుతావా లేదా!" అంటూ ఒక్క ఉదుటున భార్య నిలుచున్న చోటికి ప్రసాదరావు దుమికినాడు. లక్ష్మి కంపిత స్వరంతో "అన్నపూర్ణమ్మ గారింటికి వెళ్లాను" అంది.

భుజం పట్టుకొని గుంజుతూ "ఓహో! షికార్లుయెక్కువైపోయాయి. ఏం స్వతంత్రం కదా! ఆడముండవు ఒకమూల పడిఉండక పోకిరీ వెధవలా వీధులంట తిరుగుతావ్రా? నారాయణరావు పెళ్లాం (అన్నపూర్ణ) మాటికేం! కచ్చ కట్టుకొన్న మగవాళ్ళను మించిపోయి సంచరిస్తుంది. దానికెప్పుడూ స్వతంత్రతకావాలె. అలాంటిదాయి సంసారం ఎందుకు చేస్తుందో తెలీదు- బజారులో ఉండి పడుపువృత్తి చేయకుండాను."

లక్ష్మికి ఈమాటలు సహించినవి కావు. తననుంచి, ఒక ఉత్తమ యిల్లాలికి విన రాని మాటలు. అనవుసరంగా అవుతూన్నవి.

"ఆవిణ్ణి నీచంగా మాటాడకండి. నన్ను రావలసిదని ఆవిడె కోరటంలేదు. నేనే అత్తగారిని అడిగి వాళ్ళయింటికి వెళ్లాను"

"అబ్బా! ఆముండనంటే ఎంత రోషం వచ్చింది. అత్తగారు అనుమతిస్తే వెళ్ళినావా రేపు అత్తగారు సానరికం చేయమంటేకూడా చేస్తావు కాబోలు...ఈ ఘంటన్నరై వాళ్ళయింట్లో ఏంచేస్తున్నావు?"

...............”

“మాటాడవేం?”

“గంటన్నర ఎక్కువైంది? మూడున్నర కల్లా వెళ్లాను. ఇపుడు నాలుగుంపావు అయింది. వాళ్లయింటివద్ద అరగంటే ఉన్నాను”

“దొంగముండా! అబద్ధాలు కూడానా! నన్నే దమాయిస్తున్నావా” అంటూ మద్యం త్రాగిన వాడిమల్లె, క్రిందుమీదు చూడకుండా, పాపం, ఆ అభాగినిని కొట్టనారంభించినాడు. శక్తి చల్లారిన తరువాత ఒక్క గెంటుతో గదినుంచి పైకి నెట్టివేసినాడు.

## ౨

ఆ నాడు టౌనుహాలులో ప్రసాదరావు “స్వాతంత్ర్యం” గురించి ఉపన్యసిస్తాడని అందరకూ తెలిసింది. అనేకమంది సభకువచ్చినారు. కాన్సేపటికి ప్రసాదరావు లేచి వేదికమీద నిలుచుని గంభీరంగా ఈలా ఉపన్యసించాడు:

“సోదరులారా! ప్రపంచంలో ఏ వ్యక్తికికూడ పారతంత్ర్యం అనుభవించాలని లేదు. భగవంతుడు సకల జీవరాసుల్ని స్వతంత్రంగా ఉండాలనే పుట్టించినాడు. పశుపక్ష్యాదులు చూడండి; ఎంత స్వేచ్ఛగా సంచరిస్తూంటాయో! ఒక చిలుకనుగాని, గోరువంకనుగాని పట్టి పంజరంలో బంధించినామంటే, అది బయటకు వెళ్ళిపోయివచ్చుటకు, ఇచ్ఛావృత్తిగా మసలుటకు ఎంత అభిలషిస్తుందో! వాటిని మనం ఎంత ప్రేమగా చూచినా, మంచి మంచి ఆహారం ఇచ్చినా, వాటిని అవి కోరవు!! ఏ విధంగానైనా ఆ చెరనుంచి తప్పించుకొని బయట పడుటకే అవి ప్రయత్నిస్తవి. అటువంటిది. జ్ఞానంతో కూడుకున్న మానవజాతి ఎందుకు అస్వతంత్రం అనుభవించాలె? స్త్రీ పురుషులు, బాలవృద్ధులు పండిత పామరులు రాజులు నౌకర్లు వీరువారు అనటం ఎందుకు ప్రపంచంలో వున్న వారందరూ ఏనాడు సమానస్వేచ్ఛ స్వాతంత్ర్యములు అనుభవిస్తారో ఆనాడే లోకకల్యాణం (హర్షధ్వనులు) కాని మనలో మనమే, మన స్వాతంత్ర్యాన్ని పాడుచేసుకుంటున్నాం; భార్యకు స్వాతంత్రం యిచ్చినామా,-మనమాడే ఆటలు సాగవు అన్నభయం; కుమారునికి స్వతంత్ర్యం యిచ్చినామా, మనం ఒక మూలనుపడి ఉండవలసి వస్తుందన్న భయం; తమ్ములకు స్వతంత్రం యిచ్చినామా వాళ్ళకు జోహారులు చేయవలసి వస్తుందన్న భయం; నౌకర్లకు స్వాతంత్ర్యం యిచ్చినామా, వాళ్ళక్రింద మనమీ నౌకరీ చేయవలసివస్తుందన్న భయం; ఇంత భయంతో నిండుకున్నమనం, మనకు స్వాతంత్ర్యంలేదని ఎందుకు విచారించటం!

“చూడండి! ఒక్కమాట నేను నిర్మొగమాటంగా అంటున్నాను. ఎవరు ఏమనుకున్నా నాకు యిబ్బందిలేదు! ఒక్కసారి మీమీ మనస్సులను అడగండి! మీ చేతిక్రిందనున్న వారలకు ఎంతెంత స్వేచ్ఛ, స్వతంత్రం యిస్తున్నారో! అంత యెందుకు? మీ అర్ధాంగినులకు-అగ్నిసాక్షిగ పెండ్లాడిన భార్యలకు ఎంత స్వతంత్రం యిస్తున్నారో? ఆఫీసునుంచో, బజారునుంచో ఊరినుంచో యింటికివచ్చేసరికి ఆవిడ (భార్య) లేకపోతే మీ మనస్సులు ఎంత ఉద్రేక పూరితం అయిపోతవో! మీ మాటలేనిది, మీ ఆజ్ఞలేనిది, ఎంతటి ఆత్మీయుల దగ్గరకేనా, ఎంతటి ప్రాణస్నేహితుల దగ్గరకేనా, గొప్పకష్టములలో వున్న బంధువుల దగ్గరకేనా వెళ్ళటానికి వీలులేదే? పోనీ! మీ ఆజ్ఞలను పొంది వెళ్ళుదామనే మిమ్మల్ని ప్రార్థించారనుకోండి- మీరుమాత్రం అనుమతిస్తున్నారా? ఎక్కడో నూటికినాటికి ఒక్కరుగాని తక్కినవారంతా ఏంజేస్తున్నారు? మీలో సగం శరీరం అనుకున్నవాళ్ళకే అట్టి అవకాశం లేనప్పుడు. మీ కెక్కడనుంచి వస్తుందయ్యా ఆ స్వతంత్రం?

“ఏదో మాబోటివాళ్ళం, ఈ స్వతంత్రం, స్వేచ్ఛ అనే వస్తువుని పోనీ అందరూ అనుభవించనీ అంటే, ఎన్ని తర్కవితర్కాలు, ఎన్ని విచారణలు బయలుదేరుతాయో, చెప్పలేం!! అయితే నేను మాత్రం ఈలాంటి తర్కాల్ని లక్ష్యం చేసేవాడినికాను. నా యింటిలోవున్న ప్రతిజీవికూడా జన్మహక్కు అయిన స్వతంత్రం అనుభవించాలనే నా సిద్ధాంతం. లోగడ నేను రాజమహేంద్రవరంలో ఉన్నప్పుడు నాయింట్లో నలుగురు నౌకర్లు ఉండేవారు. ఒక్కొక్కరికి నెలకు 12 రూపాయిలు జీతం యిస్తుండేవాడిని; నెల వచ్చేసరికి డబ్బుకనే నాదగ్గరకు వచ్చేవారు. తరువాత ఏంచేసేది, ఎక్కడకు వెళ్లేది, నాకు తెలియదు. ఆ ఊరిపెద్ద డాక్టరుగారు వాళ్ళను పిలిపించి “నెలకు 15 రూపాయిలు యిస్తాను. నాదగ్గరకు వెళ్లిపోరండి” అని కోరినప్పటికీ వాళ్లు వెళ్ళటంలేదు. ఇక నౌకర్లకే అంత స్వేచ్ఛ యిచ్చేటప్పుడు తక్కినవారి సంగతి ఏలా ఉంటుందో ఆలోచించండి! అయితే చెప్పవలసివచ్చేదేమంటే ఒక ప్రాణిని పారతంత్ర్యంలో ఉంచి, ఆ ఆత్మను దుఃఖపజేసేది నామతంకాదు. కాని అందరూ అలా నడవటం చాలకష్టం.

“కనుక మనం అందరం ముందుగా మన యింటిని చక్కబెట్టుకొని, తరువాత తక్కినవారిని ఉద్ధరింటం మంచిదని నా ముఖ్యోద్దేశం”

ఉపన్యాసం పూర్తి కాగానే ప్రబలందరూ హాహర్ష ధ్వనులు గావించి, ప్రసాదరావుని ప్రశంసిస్తూ, వెళ్లిపోయినారు.

## ౩

సాయంత్రం 5 గంటల సమయం.

“ఏం నాయనా! ఎక్కడికి బయల్దేరావు?”

"సినీమాకు."

"ఏం సినీమా?"

"లవకుశ."

"లవకుశ? క్రిందటి పర్యాయం అది వచ్చినప్పుడు లక్ష్మికి జబ్బుగా ఉంది. అందుచాత చూడ్డం అయింది కాదు. ఇప్పుడు వెళ్లాలని చాలా భ్రాంతి పడుతూంది. ఒకసారి తీసుకొని వెళ్దూ."

"ఓహో! రాణీగారికి ఇది ఒకటే తక్కువై పోయింది. దానికి సిగ్గులేదూ సినిమాలు చూడ్డానికి బయల్దేరుతుంది!"

"ఆలాగంటా వేమిట్రా! ఊరులో వున్న వాళ్ళంతాన్నూ విరగబడి వెళ్తూంటేను. అదీగాక నీతో వెళ్లటానికి ఏం ఆక్షేపణ?"

"ఆక్షేపణా? అది ఆడదాయికదూ? మగాడితో సమానంగా సినీమాలు, నాటకాలు వింతలూ, విశేషాలూ, చూడ్డానికి బయల్దేరుతుందా? అని దొరసానా ఏమిటి మగవాడికి ఉన్న హక్కులు దానికి ఉండటానికి? అది హిందూదేశంలో పుట్టి పెరిగిన ఆడదాయి. చెప్పుక్రింద తేలులాగ అణిగి ఉండవలసిందే! నీవు దానికి కావలసినంత స్వతంత్రం యిచ్చి యింతవఱకూ తెచ్చేవు. తలమీద ఎక్కించుకున్నావు. అత్త అన్న భయం కొంచెమైనా దానికి ఉందీ?"

"ఆలాగా? దాని సంగతి నీలాంటివాడికి యెలా బోధపడుతుంది? చెప్పవలసి వస్తే అది సాక్షాత్తు లక్ష్మి. నీవంటి పశువుకు అది భార్య అవటం. ప్రారబ్ధకర్మం."

"పోపో! అట్టే మాటాడకు. నీ పరువు నీవు దక్కించుకో" అంటూ, ధుమ ధుమ లాడుతూ బయటికి వెళ్లి పోయాడు.

* * *

సాయంత్రం 6 గంటలయింది. సినీమా హాలు క్రిక్కిరిసి ఉంది. ప్రసాదరావు రిజర్వుడు సీటు, టిక్కట్టు కొని లోన ప్రవేశించినాడు. తాను కూచున్న ప్రక్కనే "ఆడిట్ ఆఫీసు" హెడ్ గుమస్తా తిరుమలరావు అతని భార్యా కూచున్నారు. ప్రసాదరావుని చూడగానే తిరుమలరావు "ఓహో! ప్రసాదరావుగారా?" అని పలుకరించాడు "హల్లో! తిరుమలరావుగారూ! మీరూ వచ్చారూ?"

"ఆఁ ఆఁ ఒక్కణ్ణే కాదు! కూడా రాణీగారున్నూ" అన్నాడు నవ్వుతూ భార్యను చూపించి—

"వెరీగుడ్! అలా ఉండాలండి! మన వంటి యువకులు స్త్రీ స్వాతంత్ర్య గురించి పాటుపడితే ఎంతోకాలం అవుసరం లేదు దేశం బాగుపడ్డానికి."

"కాని లోకం—"

మాటకు అడ్డువచ్చి "పోనిద్దురూ వెధవ లోకం! దానికేమిటి? నోటికి వచ్చినట్లూ వాగటమే వేకదూ? దానికి భయపడితే చివరకు ఊపిరి తీయటాని కూడా వీల్లేదు. కొందరు మాత్రం 'అలా చెయ్యాలె, ఈలా చెయ్యాలె' అని డాబులు కొట్టుతూండటం, పత్రికలు నింపుతూండటం కాని ఆచరణ శూన్యం అందుకనే దేశం ఈ త్రోవకు వచ్చింది. ఈ దేశ నాయకుల సంగతి చూడండి! ఖద్దరు తొడిగి, గాంధీటోపీ నెత్తిని తగిలించి, నాల్గు పట్నాలు తిరిగి, గొంతుకు బ్రద్దలయ్యేట్టు ఉపన్యాసాలిచ్చి, తమలో తామే మురిసి పోతున్నారు. కాని వాళ్లు ఉపదేశించినట్టు ఎంతవఱకు కార్యరూపంగా చేస్తున్నారు? ఒక్కరైనా స్వార్థం విడిచి పెడుతున్నారూ? మన ఆంధ్ర దేశం సంగతి చూడండి! మనవాళ్లు, అసెంబ్లీ, కౌన్సిలు మెంబర్లు, మంత్రులు, కాక పూర్వం, దేశాన్ని ఉద్ధరిస్తామని ఎంతెంత ప్రగల్భాలు పలికారు? పదవులు స్వీకరించగానే ఏం చేయగలిగారు? తమిళ నాయకుడు ప్రధాని అవటం చాత, వాళ్ల జిల్లాలకు గుడ్డిలో మెల్ల అన్నట్లు కొన్ని పనులు చేశారు. కాని మన ఆంధ్రులకు ఏం జేశారు? అంధుల్నితప్ప వేరేమీ చేయటం లేదు. ఎన్నాళ్లనుంచి అటమటిస్తున్నాం ఆంధ్ర రాష్ట్రం అని? ఇప్పటికి తేలిందేమిటి? జస్టిసు ప్రభుత్వంలో కూడా అలానే వచ్చింది."

"ఔను లెండి! చేయటం కన్నా చెప్పటం సులభం. ప్రపంచం అంతా చెబుతుంది. చేసేవాళ్లెవరు? తండ్రి చుట్ట తాగుతూంటాడు కొడుకుని వద్దంటాడు. కాని ఆ గుంటవెధవ మానాడూ? ప్రత్యక్షంగా కాకపోయినా పరోక్షంగానైనా త్రాగుతాడు. ఈలాగే ఉంటుంది లోక వ్యవహారం. సరే గాని మీ ఆవిడే?"

"మా ఆవిడకు ఈ దినం ఒంట్లో సుస్తీగా ఉంది. అదీ కాక రాడానికి మహాచెడ్డ సిగ్గు. పూర్వాచార పరాయణత్వం ఎక్కువ. దానికి తోడు కొంత బుద్ధిమాంద్యం. ఎన్నివిధాల బోధించినా తలకెక్కదు. ఎన్నయినా ఇంట్లోనుంచి చేస్తానంటుందే కాని పైకి మాత్రం ప్రాణంపోయినా రానంటుంది. ఏం జెయ్యటం? ఒక్కొక్కప్పుడు మాచెడ్డ చికాకు కల్గుతూంది. నాలుగు తగిలిద్దామా అనిపిస్తుంది. కాని వెంటనే ఆ పని 'పశుత్వం' అని తోస్తుంది"

"ఒకొక్కరి ప్రకృతి అది. వాళ్లననవలసిన పనిలేదు. కాని ఎన్ని అయినా ఆడదాన్ని కొట్టడం అనేది నీచాతి నీచమైన పని. రాక్షస కృత్యం."

"అవును! ఆడదాన్ని కొట్టేకంటె ఆత్మహత్య చేసుకోవటం మంచిదని నా ఉద్దేశం."

అంతలో ఆట ఆరంభమైంది.

* * *

రాత్రి 12 గంటల సమయం. లక్ష్మికి నిద్రపట్టడం లేదు. నా జీవితంలో ఒక నాడైనా సౌఖ్యం అనుభవిస్తానా? అన్న ప్రశ్నయే ఆమెను వేధిస్తూంది. భర్తయొక్క క్రౌర్యం ఎంతని సహించటం! తను కాపురానికి వచ్చినప్పటినుంచీ ఇంతవఱకూ, ఒక్కసారి అయినా, పతి ప్రేమామృత రసాన్ని కొంచెమైనా రుచి చూడ్డం లేదే! తోటి

వాళ్ళందరూ దాంపత్యానందం ఎంతో అనుభవిస్తున్నారే! తన కొలాంటి అదృష్టం భగవంతుడు ఎందుకు కల్గించలేదు? వారంతా గత జన్మ ఫలం? అలా నైతే తక్కిన వారందరూ గత జన్మంలో పుణ్యం చేసినవాళ్ళే అన్నమాట! ఈలా ఎంత ఆలోచించినా పాపం ఆమెకు ఏమీ తోచటం లేదు. తుదకు కలత నిద్రపట్టింది. స్వప్న లోకంలో విహరింప నారంభించింది.

తాను ప్రసాదరావుతో కూడ ఒక మహా పట్టణంలో మోటారునందు విహరిస్తున్నది. ఇరువురి ముఖాల్లోనూ ఆనందం తాండవిస్తూంది, ఆ పట్నం అంతా తిరిగి, అలసిపోయి, సముద్రపుటొడ్డునకు వెళ్లినారు. సాయంకాలపు సూర్యుని శోభ, పక్షుల కల కల ధ్వనుల యింపు, కెరటముల కలయిక సొబగు, చల్లని పిల్లగాలుల పరామర్శ, ఇసుక తిన్నెల మార్దవము, విహరింప వచ్చినవారల సందడి, చేరువగ, కెంగేలు గీలించుకొనుచు పోవుచుండు నూత్న దంపతుల నర్మసంభాషణలు, ఎంతయో ప్రమోదమునిస్తూన్నవి. ప్రసాదరావు, తన ముందుగ కూచుని, తన చేతిని రెండు చేతులలో అదిమిపట్టి, ప్రేమ భరితమైన చూపులతో "లక్ష్మీ! నీవు నా గృహలక్ష్మివి! నా ప్రాణలక్ష్మివి!! నీతో నుండే వనవాసం కూడ నాకు స్వర్గం కన్న ఎక్కువ. మన ఇరువురి అంతరాత్మలూ ఒకసారి ఆ పరాత్పరునిలో లీనం కావడమే నా మనోభిలాష" అని పలుకుతూన్నాడు.

అంతలో నిద్రాభంగమైంది. బెదరు చూపులతో లక్ష్మి లేచి, ప్రక్క మీద కూచుంది. కలను తలంచుకుంటూంది. ఆ స్వప్నంలో తన జీవితం కూడ అంతమైపోతే ఎంతో బాగుండును కదా అని విచారపడ నారంభించింది. కాని అట్టి అవకాశం ఎక్కడ?

## ౪

ఆ దినం లక్ష్మి మేనమామ కుమారుడు మోహనరావు వచ్చినాడు. లక్ష్మి కన్న మోహనరావు మూడేళ్లు పెద్ద. ఆనర్సు కోర్సు చదువుతూన్నాడు.

సాయంత్రం, డాబా మీద, వాలు కుర్చీలో కూచొని మోహనరావు, కేతవరపు వారి 'లక్ష్మీ ప్రసాదం' నవల చదువుతూన్నాడు. అందు లక్ష్మి యొక్క కడగండ్లు, రాజేశ్వరమ్మ (అత్తగారి) క్రౌర్యము, మామగారి ఉదాసీనత, ప్రసాదరావు శోచనీయావస్థ, అతన్ని గాఢాలోచనలో ముంచి వేసినవి. అంతలో మేనమరదలు లక్ష్మి వెండి పళ్లెంలో మిఠాయిదినుసులు, గ్లాసుతో కాఫీ తెచ్చి దగ్గరగావున్న చిన్న బల్లమీద ఉంచి పోబోతూంది. మోహనరావు ఆలోచనలకు భంగం కలిగింది. లక్ష్మిని చూచినాడు. పిలిచినాడు. ప్రశ్నార్థకంగా వెనుకతిరిగి లక్ష్మి మోహనరావుని చూచింది.

"లక్ష్మీ! నిన్ను చూచి చాల కాలం అయింది. ఇన్నాళ్లకు వచ్చిన మేనబావను పలుకరించనైనా పలుకరించేవు కావేం?"

"..............."

"ఏం మాట్లాడవు?"

"లేదు, బావా క్షమించు" విచారసూచక స్వరంతో, నేలచూపులతో, జవాబిచ్చింది.

లక్ష్మి యొక్క ప్రకృతి మోహనరావుని ఆశ్చర్యంలో ముంచివేసింది. చిన్ననాటి ఉత్సాహము, ఆ నవ్వు మొగము, ఆ లలిత మగు చూపులు, ఆ అకళంకమైన ప్రేమ, అభిమానం, ఇప్పుడు ఎక్కడకు వెళ్లిపోయినవి? ఆనాటికి ఈనాటికి ఎంత భేదం?

"లక్ష్మీ! ఏం నీవీలా అయిపోయావు? విచారానికి నీవు నివాసం అయిపోయినట్టున్నావు. చెప్పవూ?"

"ఒంట్లో కులాసాగా లేదు."

"ఎన్నాళ్ళనుంచి?"

"సుమారు రెండుమాసాలైంది."

"జబ్బు ఏమిటి."

"జబ్బా!- ఆc- జబ్బు- అప్పటప్పటా జ్వరం వస్తూండటం. ఆకలి లేకపోవటం- కొంచెం దగ్గు."

"మందులేవీ తినటం లేదూ?"

"ఆc- తింటున్నాను కాని- మనో... కాని నయం కావటం లేదు."

"లక్ష్మీ! నీవేదో దాస్తున్నావు. నీ మాటలు నాకు సంశయంగా ఉంది. నిజానికి నీలో జబ్బు కన్పించటం లేదు. మానసికమైన రోగంతో బాధపడుతూన్నట్టున్నావు. నిజమైన సంగతి యేదో చెప్పవూ?"

"బావా! నాకేమీ మానసిక రోగం లేదు. నీవు భ్రమపడుతున్నావు."

"నీవెన్ని అను, నాకు నమ్మకం లేదు. నీ స్థితే చెబుతూంది నీవు- మనోవ్యాధితో బాధ పడుతున్నట్లు."

"అంతా నీ అనుమానం! బావా! నీదగ్గర నాకు దాపరికం ఎందుకు? నీకంటె నాకు ఆత్మీయులు ఎవరున్నారు—"

"ఔను! మేనబావ కన్న ఆత్మీయులు ఎవరు?" వ్యంగంగా అంటూ ప్రసాదరావు ప్రవేశించాడు.

లక్ష్మి, భర్తను చూచి అల్లాడిపోయింది. ముఖం వెలవెలబారిపోయింది. ఒకక్షణమైనా ఉండకుండ, తొట్రుపాటు నడకతో క్రిందికి దిగిపోయింది.

"అన్నయ్యగారూ! మిమ్మల్ని ఒక్క కోరిక కోరాలని ఉంది."

"ఏమిటోయి అది" అంటూ ప్రసాదరావు ఒక విషపునవ్వు నవ్వినాడు.

"లక్ష్మిని నాల్గు దినాలపాటు మా యింటికి పంపించాలని నాకోరిక."

"ఆc- ఆc- తీసుకొని వెళ్లు. నీ మేనమరదలిని తీసుకొని వెళ్ళడానికి అభ్యంతరం ఏమిటి? నాకు ఎంత హక్కు ఉందో, దాని మీద నీకూ అంతే ఉంది."

"ఆలా అనకండి! అది మీ యిల్లాలు. మీకున్న హక్కు నాకేలా ఉంటుంది?"

"అది కాదోయి వెఱ్ఱివాడా! స్వాతంత్ర్యం అనేది అందరకూ ఒక్క విధంగా ఉండాలి! నామతం నీకింకా బోధపడ్డం లేదు! నీ ఇష్టం వచ్చినప్పుడు తీసుకువెళ్లు. నే నడ్డు చెప్పను."

"ఆలానైతే చాల సంతోషం. ఎల్లుండి శుక్రవారం మంచిది. నా తో నే తీసుక వెళ్తాను."

"ఓ, నిరభ్యంతరంగా!"

* * *

ఆ నాటిరాత్రి పదిగంటలు, అందరూ నిద్రాదేవి ఒడిలో హాయిని అనుభవిస్తున్నారు. లక్ష్మీ ప్రసాదరావులు మాత్రం ఆ హాయిని పొందలేదు.

"రంకుముండా! బావతో ఏంరేం మంతనాలాడుతున్నావు?"

"...............

"పలకవేం?"

"...............

"మాట్లాడతావా తన్నేదా? ఎప్పుడూ కూడూ అడిగిన వెంటనే బదులు చెప్పవు?" అంటూ లెంపకాయ లాగినాడు.

"ఏమీ లేదూ! నా శరీర ఆరోగ్యం గురించి అతడు అడుగుతోన్నాడు."

"అబద్ధాలా దొంగముండా! ఎక్కడ నేర్చినావే యీలాంటి కల్పనలు? ఔనురంకు నేర్చినది బొంక నేర్చదా? నీకు నీ బావకంటే ఆత్మీయులు ఎవరూ లేరా? ఫో! వాడి దగ్గరకే వెళ్లు. సుఖంగా కాపరం చెయ్యి."

"మీ పాదసాక్షి. నేను వేరే దురభిప్రాయంతో అనలేదు. నా శరీర స్థితిని గురించి ఆయన చెడు ఊహలు పడుతూంటే 'నీకంటె ఆత్మీయులు ఎవరున్నారు? నీదగ్గర దాపరికం ఎందుకు' అన్నాను."

"ఔను! మీ యెత్తులు నాకు బోధ కావేదని అనుకోకు. నీ వీలాంటి పచ్చి రంకు బోతువి అవుతావని నేను తలంచలేదు నిన్నిలా మట్టి పెట్టి ఉంచుతూంటేనే ఇంత చెలరేగుతున్నావు. ఆకాసంత స్వాతంత్రం యిస్తే, సానిదానికన్న అర్ధ్వానం అయిపోయి ఉందువు"

"మీరు మాటిమాటికీ నా శీలాన్ని నిందించకండి. ఇప్పుడు అనుభవిస్తూన్న వ్యథకు మరింత వ్యథ కల్పించకండి."

"ఆఁ- ఏమంటున్నావు" అని లేడిపిల్ల మీదకు దుమికిన పెద్దపులి లాగ ఒక్క ఉదుటున వచ్చి, మెడపట్టుకొని ఒక గెంటు గెంటినాడు. దాంతో ఆ అభాగిని తూలిపోయి ద్వారబంధం పైని పడిపోయింది. తలమీద పెద్దగాయం పడ్డది. కర్తం ధారగా స్రవిస్తూంది. ఆ పిశాచం, మరి నాలుగు తన్నులు తన్ని, గదినుండి బయటకు వెళ్లిపోవచ్చాడు.

* * *

ఉదయం ప్రసాదరావు, మోహనరావు ఫలహారం చేస్తున్నారు. లక్ష్మి కాఫీ తెచ్చి బల్ల మీద ఉంచింది.

"ఏం లక్ష్మీ! తలకు ఆ కట్టు ఏమిటి?"

"ఏమీ లేదు. రాత్రి మంచంమీదనుంచి పడిపోయాను. చిన్న దెబ్బతగిలింది."

"దొడ్డమ్మగారిని ఒకసారి పిల్చుకొనిరా."

ప్రసాదరావు తల్లి వచ్చింది.

"ఏం నాయనా?"

"లక్ష్మిని ఒకసారి మాయింటికి పంపించరూ?"

"నీ అన్నను అడుగు."

"అన్నయ్యగారి అనుమతి పొందాను."

"సరే! నాకేమీ అభ్యంతరం లేదు."

"బావా! ఇప్పట్లో రాను. నీభార్య వచ్చినప్పుడు వస్తాను"

"వెళ్లు వెళ్లు. ఆలా నిరాకరించడం తప్పు! నీకున్న ఆత్మీయుల్లో నీ మేనబావ ఒక్కడే కదూ? అంత ప్రేమగా పిలుస్తూన్నప్పుడు రానన్టం ఏమిటి? ఈ కాలంలో ఆలా పిల్చేవాళ్లెవరు?" అని ప్రసాదరావు అన్నాడు.

లక్ష్మి మాటాడకుండా అక్కడనుంచి వెళ్లిపోయింది.

మరనాడు మోహనరావు, తన స్వగ్రామం వెళ్ళిపోయినాడు.

౫

లక్ష్మి మనోవ్యాధి ప్రబలంమైపోయింది. నెలనాళ్లై మంచం పట్టింది. దానికి తోడు ఆనాడు తలమీద తగిలిన గాయం ఒకటి. జ్వరం తీవ్రంగా వస్తూంది. ప్రసాదరావు ఆమె వేపే చూడనే చూడలేదు. ఎప్పుడైనా తారసపడిచి వ్యంగంగా, ములుకుల్లాంటి మాట్లంటుండేవాడు. అత్తమాత్రం చేతిసాధనాల్తో కోడల్ని ఆరోగ్య దశలోనికి తెచ్చుటకు ప్రయత్నిస్తూంది. తలమీద పడ్డ గాయం మాత్రం మానింది. కాని మనస్సులో పడ్డ గాయం మానటం లేదు. రోజుకు రోజూ అభివృద్ధి చెందుతూనే ఉంది. ఒకనాటి ప్రభాతవేళ, లక్ష్మి జీవాత్మ, ఈ నరకకూపంనుంచి ముక్తయై, అనంతాత్మనిలో లీనం అయిపోయింది.

* * *

రెండుదినాలు గడిచాయి. ఒక దిన పత్రికలో, ఈ దిగువ సంపాదకీయము ప్రకటింపబడి ఉంది:

"ఈ పట్టణమున, జిల్లా ఇంజినీరింగు ఆఫీసు హెడ్ క్లార్కుగా పనిచేయుచున్న మ॥రా॥రా॥ శ్రీ సి. ప్రసాద రావు గారి అర్ధాంగి, శ్రీమతి లక్ష్మీదేవి గారు, హఠాత్తుగా, హృద్రోగమువలన, పరమపదించినారని తెల్పుటకు మిగుల విచారించుచున్నాము. శ్రీ ప్రసాదరావుగారిని తెలియనివారెవ్వరుండరనియే మానమ్మకము. వారు స్వాతంత్ర్యాభిలాషి. ఎన్నియో పట్టణములందు 'స్వాతంత్ర్యము, స్వేచ్ఛ'లగురించి ఉపన్యాసములిచ్చి, ప్రజలను ముగ్ధులనొనరించియున్నారు. వారివి ఎన్నియో వ్యాసములు ఈపత్రికాముఖమున ప్రకటింపబడినవి. అందువలన వారందరకు చిరపరిచయులు. శ్రీవారు, లేతవయసుననే, తమ అర్ధాంగిని కోల్పోవుట, మిగుల దుస్సహము. పత్నీ వియోగ దుఃఖసముద్రమున మునిగియున్నారు. వారినికి, తక్కుంగల బంధువులకును, ఇందుమూలమున మా ఓదార్పుల నందజేయుచున్నాము. పరమపదించిన శ్రీ లక్ష్మీదేవిగారి ఆత్మకు, శాంతి నొసంగవలసినదని ఆ పరాత్పరుని ప్రార్థించుచున్నాము."

